క్లుప్తంగా

ఎస్సీ, మైనార్టీలకు రుణం

పోరుమామిళ్ల: మండలంలోని 18 మంది ఎస్సీలు, 43 మంది ముస్లిం మైనార్టీలకు రాయితీపై రుణాలు మంజూరు చేస్తునట్లు ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆటో, ట్రాక్టర్, మొబైల్ ఫుడ్ ట్రక్, కోత మిషన్, క్యాటరింగ్, బ్యూటీషియన్, కూరగాయల అంగడి, కిరాణాషాపులకు ఈ రాయితీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఆయన వివరించారు. యూనిట్‌ను బట్టి రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు రుణం ఇస్తారని, ఆయా కార్పొరేషన్ల ద్వారా 50 శాతం రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు. ఈ రుణాలు పొందేందుకు రెండు రోజుల్లో బీసీ, ఈబీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు అందజేస్తే పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ చెప్పారు.

పీహెచ్‌సీ తనిఖీ



వైద్య సిబ్బందితో జోనల్ అధికారి

పోరుమామిళ్ల: టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మీనాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బందితో ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా తదితర కీటక జనిత వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఉండాలని, ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించేలా ప్రజలను చైతన్యం చేయాలని తెలిపారు. జోనల్ ఆరోగ్య విస్తరణాధికారి నిత్యపూజయ్య ల్యాబ్ రికార్డ్స్ పరిశీలించి అవసరమైన మెటీరియల్ గురించి విచారించారు. వైద్యాధికారి సాధు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, రఘురామ్, బాలాజీ పాల్గొన్నారు.

ఏబీవీపీ క్యాలెండర్ ఆవిష్కరణ

పోరుమామిళ్ల: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 2025 క్యాలెండర్‌ను గురువారం సీఐ శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఏబీవీపీ రాష్ట్ర నాయకులు అభిలాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ మండల నాయకులు చంద్ర, కార్తీక్, రాహుల్, నందు పాల్గొన్నారు. అభిలాష్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం నిబద్ధతతో పని చేసే సంస్థ ఏబీవీపీ అన్నారు. చదువుతోపాటు సమాజ సేవ లక్ష్యంగా, దేశం కోసం పనిచేసే సంస్థ ఏబీవీపీ అన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు: స్థానిక మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో కమిషనర్ మల్లికార్జున గురువారం పర్యటించారు. గంగమ్మ దేవాలయం, రాముని దేవాలయం, లైట్‌పాలెం, జిన్నా రోడ్డులోని ఉర్దూ హైస్కూల్, మోడంపల్లెలోని నాగమ్మ పాయింట్ వద్ద చెత్త పాయింట్లను సిబ్బందితో శుభ్రం చేయించారు. మోడంపల్లెలోని శేషాద్రి అపార్ట్‌మెంట్ సభ్యుల ఫిర్యాదు మేరకు కొత్తపల్లె ఛానల్‌లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎం.గోవిందరెడ్డి, వి.సుబ్బరాయుడు, నూర్ బాషా పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేయొద్దు

దువ్వూరు: క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేయొద్దని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వికసిత తెలిపారు. మండలంలోని చింతకుంట సచివాలయంలో క్యాన్సర్, కుష్ఠు అనుమానిత కేసులను డాక్టర్ వికసిత పరీక్షించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రజలకు క్యాన్సర్ లక్షణాలపై అవగాహన కల్పించాలని డాక్టర్ తెలిపారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బలిజలకు రిజర్వేషన్ కల్పించకపోతే దీక్ష

మైదుకూరు: రాయలసీమ బలిజలకు ఆగస్టు 15వ తేదీలోగా రిజర్వేషన్ కల్పించకపోతే ఆమరణ దీక్షకు కూడా వెనుకాడబోనని రాయలసీమ బలిజ సంఘం ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు సమతం రాము తెలిపారు. మైదుకూరులో జరిగిన సమావేశంలో రాము మాట్లాడుతూ కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సరైన నిర్ణయం తీసుకోలేకపోవడంతో రాష్ట్రంలో కాపు, తెలగ, బలిజలు బీసీల్లో చేరలేకపోయారన్నారు. ఈ సమావేశంలో దాసరి బాబురావు, పాశం లక్ష్మీనరసయ్య, ఆరె వెంకటేశ్వర్లు, బీపీ సుధాకర్‌రెడ్డి, కామనూరు శ్రీనివాసులు, బెల్లం సుబ్బరాయుడు, భూమిరెడ్డి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

హాస్టళ్ల సంక్షేమానికి కృషి

ప్రొద్దుటూరు కల్చరల్: సంక్షేమ వసతి గృహాల సంక్షేమానికి కృషి చేస్తామని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. నాగార్జున ఐటీఐలో గురువారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఊరిబయట హాస్టల్ ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అనంతరం ఓబీసీ విద్యార్థి సంఘం నూతన కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మునిసాయిని ఎన్నుకున్నారు. కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ్, నాగార్జున, వెంకట్, పార్థసారథి పాల్గొన్నారు.

చెరువే కదా.. తవ్వేద్దాం

సామాన్యులు ఎవరైనా చెరువులో గంపెడు మట్టి తీసుకెళ్తే.. వాహనం సీజ్ చేసి పెనాల్టీ విధించే అధికారులు వారిని మాత్రం వదిలేస్తున్నారు. అనుమతులు లేకుండా నెలల తరబడి అక్రమంగా మట్టి తరలిస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోతున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ఖాజీపేట మండలం నాగసానిపల్లె చెరువు దుస్థితి ఇదీ..

- నాగసానిపల్లె చెరువులో జేసీబీలతో అక్రమ తవ్వకాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- పంటలు దెబ్బతింటాయంటున్న రైతులు



చెరువులో పెద్ద జేసీబీ సహాయంతో మట్టిని తరలిస్తున్న వాహనాలు

మండలంలోని నాగసానిపల్లె చెరువు ఒండ్రు మట్టి పుష్కలంగా ఉంది. కొండల్లో వర్షం పడితే చెరువుకు నీరు చేరి చుట్టుపక్కల బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు మెరుగవుతాయి. మూడు లేక నాలుగు సంవత్సరాలకోసారి ఈ చెరువుకు నీరు చేరడంతో రైతులు పంటలు పండించే వారు. అయితే ఇటీవల చెరువుపై కొందరు కాంట్రాక్టర్లు కన్నేశారు. జాతీయ రహదారి నిర్మాణం పేరుతో చెరువులో మట్టి తవ్వకాలు జోరుగా సాగిస్తున్నారు. భారీ జేసీబీలు పెట్టి 15 టిప్పర్లతో రోజూ రేయింబవళ్లు సుమారు 13 అడుగుల లోతుకు మట్టిని తవ్వేస్తున్నారు. చెరువు దిగువన గలుగు రాయి వచ్చే స్థాయికి తవ్వడంతో తూము పైభాగం వరకు నీరు చేరేది కష్టమేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సారవంతమైన మట్టిని తొలగించడంతో నీరు నిల్వ ఉండే అవకాశం లేదని చెబుతున్నారు. రెండు నెలల నుంచి ఈ వ్యవహారం సాగుతోందని చెబుతున్నారు.

రాయల్టీ చెల్లించకుండానే..

ప్రభుత్వం చేపట్టిన పనులు, జాతీయ రహదారుల నిర్మాణాలకు మట్టి కావాల్సి వస్తే సంబంధిత శాఖ నుంచి అనుమతులు తీసుకుని రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే మట్టి తవ్వుతున్న కంపెనీ తమకు ఎలాంటి రాయల్టీ కట్టలేదని అధికారులు చెబుతున్నారు. సాధారణ అవసరాలకు అయితే క్యూబిక్ మీటరుకు రూ.50 నుంచి రూ.60 చెల్లించాలి. వాణిజ్య అవసరాలకు అయితే రూ.135 నుంచి రూ.140 చెల్లించాలి.. ఒక ట్రాక్టర్‌కు మూడు క్యూబిక్ మీటర్లు, అదే టిప్పర్‌కయితే ఆరు క్యూబిక్ మీటర్ల మట్టి సరిపోతుంది. దీంతో వాహనానికి రూ.750 నుంచి రూ.800 వరకు రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే అనుమతులు లేకుండా లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తరలిస్తున్నా.. అధికారులు పట్టించుక్లోఏదు. దీంతో లక్షల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది.

పంటలు దెబ్బతింటున్నాయి

చెరువు నుంచి మట్టి తరలించడంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు తెలిపారు. నష్టం భరించలేక రైతులు కోపంతో వాహనాలను ఆపి ధర్నా చేశారు. దీంతో అడిగిన వారికి పంట నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పి వెళ్లిపోయారు. స్థానిక అవసరాల కోసం రైతులు మట్టిని తరలిస్తే అధికారులు వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ ఫెనాల్టీ వేసి ఇబ్బందికి గురిచేస్తారని, ఇపుడు పెద్ద ఎత్తున తరలిస్తున్నా పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలువురు అధికారులకు పలుమార్లు ఫిర్యాదుచేసినా స్పందించలేదని చెబుతున్నారు. చిన్న నీటి పారుదల శాఖ ఈఈ వెంకటరామయ్య వివరణకోరగా.. నాగసానిపల్లె చెరువులో మట్టి తరలించేందుకు గతంలో ఓ ప్రైవేట్ కంపెనీకి మాత్రమే ఇచ్చిన ఎన్‌ఓసీకి కాలపరిమితి పూర్తయిందని, తిరిగి ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. రాయల్టీ చెల్లించలేదన్నారు.

మట్టి తవ్వకాలు ఆపమని చెప్పాం



చెరువులో మట్టి తరలించేందుకు రెవెన్యూపరంగా ఎలాంటి అనుమతులు లేవు. అందువల్ల తవ్వకాలను ఆపేయాలని చెప్పాం.. అయినా మట్టి తరలిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

– మహబూబ్ బాషా, తహసీల్దారు, ఖాజీపేట

13 అడుగుల వరకూ తవ్వుతున్నారు



చెరువు మట్టిని సుమారు 13 అడుగుల తోతు వరకూ తవ్వుతున్నారు. చెరువు పైభాగంలోని సారవంతమైన మట్టి పోయింది.. దిగువన కలుగు రాయి కనిపిస్తోంది.. నీరు నిల్వ ఉండడం కష్టమే. పంటలు పండగక నష్టపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కొండయ్య, రైతు, నాగసానిపల్లె

దుమ్ముతో పంట దెబ్బతింటోంది



నిత్యం భారీ టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. పంటల పక్కనే వెళ్తుండడంతో దుమ్ము, ధూళి పెరుగుతోంది. మట్టితో సాగు చేసిన పంట దెబ్బతింటోంది. పంట నష్టపోతున్నాం. రైతులకు పరిహారం చెల్లించాలి. లేదంటే అక్రమ మట్టి తవ్వకాలు ఆపివేయాలి.

– నరసింహులు, రైతు, నాగసానిపల్లె

సంస్థ అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలి

బద్వేలు అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని బద్వేల్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్‌సి.నిరంజన్ పేర్కొన్నారు. ఆర్టీసీ గ్యారేజీలో గురువారం జరిగిన ఆదర్శ ఉద్యోగుల అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి పోటీతత్వంతో పనిచేసి సత్ఫలితాలు సాధించాలని కోరారు. సమయపాలన పాటిస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంలో బాధ్యతాయుతంగా నడుచుకోవాలని కోరారు. అనంతరం డీజిల్ ఆదా, సంస్థ ఆదాయం, వాహనాల కండీషన్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఉద్యోగులను, డ్రైవర్లను, కండక్టర్లను, మెకానిక్‌లను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ బి.ఎస్.నాయక్, ఉద్యోగులు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



ఆర్టీసీలో ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంవీఐ, డీఎం

కేఆర్ఎంబీని ఏర్పాటుచేయాలి

చాపాడు: కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ డిమాండ్ చేశారు. తహసీల్దారు రమాకుమారిని గురువారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ రైతు భరోసా పథకం కింద రూ.20 వేలు ఎప్పుడిస్తారో ప్రభుత్వం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరం వెంకటేశ్వర్లు, కేతవరం వెంకట సుబ్బారెడ్డి, కొనిరెడ్డి రామాంజనేయరెడ్డి, ప్రసాద్, గోపాల్ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై తక్షణమే స్పందించాలి

బ్రహ్మంగారిమఠం: బి.మఠం మండలంలో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులకు అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలని బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో గురువారం మూడు గంటలకు పైగా ఆయన సమీక్షించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రీన్ హైవే రోడ్డు అడ్డంకులు, రీ సర్వే పనులు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. మల్లేపల్లె, ముడుమాల పంచాయతీలో భూములు అప్పచెబితే పనులు సాగుతాయన్నారు. వారి పరిధిలో సమస్య ఉంటే వీఆర్వోలు అధికారుల దృష్టికి తీసుకురావాలని, పొరపాట్లు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దారు దామోదర్‌రెడ్డి, డీటీ జాన్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్

నాలుగో రోజుకు చేరిన నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్: స్టైఫండ్ పెంచాలని మండలంలోని గోపవరం సమీపంలోని పశు వైద్య కళాశాల విద్యార్థులు చేస్తున్న నిరసన గురువారం నాలుగో రోజుకు చేరింది. గురువారం కళాశాల ఆవరణలో టెంట్ వేసి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. క్లాసులకు గైర్హాజరై తాము ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వారు పేర్కొన్నారు.

ఎమ్మార్పీ ధరకే విక్రయించాలి

గోపవరం: ఎమ్మార్పీ ధరలకే విత్తనం, పురుగు మందులు విక్రయించాలని బద్వేల్ ఏడీఏ ఎం.నాగరాజ సూచించారు. మండలంలోని టీటీఎస్ ఆగ్రో ఏజెన్సీ విత్తన, పురుగు మందుల దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్, వే బిల్లు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు పరిశీలించారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

మైదుకూరు: స్థానిక వినాయక నగర్‌లో మృతిచెందిన షేక్షావలి కుటుంబీకులకు రూ.10 వేల ఆర్థిక సాయం చేసినట్లు వైఎస్సార్‌సీపీ నూర్ బాషా విభాగం అధ్యక్షుడు ఓ.రసూల్‌సాహెబ్ తెలిపారు. మృతుడికి నలుగురు అక్కా చెల్లెళ్లు ఉన్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మస్తాన్, ఖాసీంపీర, అబూబాకర్, బాషా పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తా

ప్రొద్దుటూరు కల్చరల్: ముస్లిం మైనార్టీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ.షరీఫ్ అన్నారు. పట్టణంలోని ఉర్దూ విద్యా సంస్థలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్ల సమస్య ఉందని విద్యార్థులు, తమను రెగ్యులర్ చేయాలని, కళాశాలలో అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, లైబ్రరీ, డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటుచేయాలని అధ్యాపకులు ఆయనను కోరారు. అనంతరం కొత్తకొట్టాల, మొడంపల్లె మున్సిపల్ ఉర్దూ పాఠశాలలను పరిశీలించారు. అమృతా నగర్‌లో ముస్లిం మైనార్టీ బాలబాలికల రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను పరిశీలించారు. వీఎస్.ముక్తియార్, ఖలీల్, బాబయ్య, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇమాంలకు రూ.10 వేలు, మౌజన్‌లకు రూ.5 వేల గౌరవవేతనం ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మాట నిలుపుకోవాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, రాయలసీమ ఇన్‌చార్జి అయూబ్‌ఖాన్‌లు వినతి పత్రం అందించారు. ప్రొద్దుటూరులో ఉర్దూ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, ఉర్దూమీడియం బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీచేయాలని, ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, కాంపిటీటివ్ పరీక్షల కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని పలువురు షరీఫ్‌కు విన్నవించారు.

నక్కలదిన్నెలో రామాలయ ప్రతిష్ట

చాపాడు: మండలంలోని నక్కలదిన్నెలో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రతిష్ట వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 5.30 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ప్రభావతమ్మ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, సీఏడీపీ శెట్టిపల్లె రామ్‌సుందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సీవీ.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న రఘురామిరెడ్డి దంపతులు

భక్తి శ్రద్ధలతో సత్యనారాయణస్వామి వత్రం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం, సహస్ర లక్ష్మీయాగం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే సత్యనారాయణస్వామి, దత్తాత్రేయస్వామి, కాశీ విశ్వేరుడు, ఆంజనేయస్వామి, సుదర్శన యోగ నరసింహ స్వామి, చాముండేశ్వరిదేవి అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సత్యనారాయణస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు కొలువుదీర్చి శాస్త్రోక్తంగా వ్రతం జరిపించారు. అనంతరం లోక కళ్యాణార్థం గణపతి, నవగ్రహ సహస్ర లక్ష్మీ యాగం శాస్త్రోక్తంగా జరిపారు. మైసూరు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థస్వామి స్వామిజీ పూర్ణాహుతిగా పూజా, హోమ ద్రవ్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి ఇస్తున్న విజయానందతీర్థ స్వామీజీ

మాజీ ఎమ్మెల్యేను పరామర్శించిన ఎంపీ

ప్రొద్దుటూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి గురువారం పరామర్శించారు. రాచమల్లు తల్లి రాచమల్లు మునిరత్నమ్మ ఇటీవల మృతి చెందారు. పార్లమెంట్ సమావేశాల అనంతరం ఎంపీ దొరసానిపల్లెలోని రాచమల్లు ఇంటికి వచ్చారు. మునిరత్నమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్ రెడ్డిలను మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక రాజకీయ పరిస్థితులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు ఆయిల్‌మిల్‌ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీపీ శేఖర్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగేంద్రారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాయపురెడ్డి, నడింపల్లె చాంద్ బాషా, కింగ్ బాషా పాల్గొన్నారు.



మునిరత్నమ్మకు నివాళి అర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

మార్కుల సాధనపై ప్రతి విద్యార్థి దృష్టి పెట్టాలి

బ్రహ్మంగారిమఠం: విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లాలంటే పదో తరగతిలో అధిక మార్కులు సాధించడంపై దృష్టి పెట్టాలని సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి అన్నారు. బి.మఠం ఇంటిగ్రేడ్ హాస్టల్‌లో కలసపాడు, పోరుమామిళ్ల, కాశినాయన, మైదుకూరు, దువ్వూరు మండలాల్లోని వసతిగృహ విద్యార్థులకు పది పరీక్షలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రభుత్వ సదుపాయాలు వినియోగించుకొని ఇష్టంగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. విద్యార్థులు తమ అనుమానాలను డీడీని అడిగి నివృత్తి చేసుకున్నారు. స్కౌట్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం మైదుకూరు ఏఎస్‌డబ్ల్యూ కె.డేవిడ్, వార్డెన్లు డీడీ సరస్వతిని సన్మానించారు. బాలుడు, మునెయ్య, నరసింహారెడ్డి, విజయమ్మ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీడీ సరస్వతి

కౌన్సిల్‌లో గొడవ చేసింది టీడీపీ సభ్యులే

మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా

ప్రొద్దుటూరు: మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో జనవరి 31న గొడవ చేసింది.. కమిషనర్‌ను దూషించింది. టీడీపీ సభ్యులేనని మున్సిపల్ వైస్ చైర్మెన్ ఆయిల్‌మిల్ ఖాజా అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ చైర్ పర్సన్ వాయిదా వేసిన తర్వాత, సమావేశం నిర్వహించడానికి ఎవరికీ హక్కు లేదనే విషయాన్ని ముక్తియార్, టీడీపీ కౌన్సిల్ సభ్యులు తెలుసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మెప్పు కోసం వైఎస్సార్‌సీపీ నాయకులపై విమర్శలు చేయడం తగదన్నారు. తాము కమిషనర్‌ను గౌరవిస్తూనే ఉన్నామని, టీడీపీ నాయకులే ఇష్టం వచ్చినట్లు దూషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రొద్దుటూరులో కూరగాయల మార్కెట్ నిర్మాణానికి రూ.50 కోట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేయిస్తే.. కూటమి ప్రభుత్వం పనులు చేయడంలో జాప్యం చేస్తోందన్నారు. మార్కెట్ నిర్మాణ ఆరంభ సమయంలో వచ్చిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి.. ఇప్పుడు మార్కెట్ నిర్మాణానికి అంత డబ్బు అవసరమా అని విమర్శించడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్ని కోట్ల నిధులు ఖర్చు చేశామో సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవాలన్నారు. నడింపల్లె చాంద్‌బాషా, కింగ్ బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆయిల్ మిల్ ఖాజా

10న నులిపురుగుల నివారణ దినోత్సవం

ప్రొద్దుటూరు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నులిపురుగుల నివారణ దినోత్సవ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలు వేస్తారని తెలిపారు. నులిపురుగులతో పిల్లల్లో రక్తహీనత, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వంతులు, విరేచనాలు, బరువు తగ్గడం, పోషకాహార లోపం, నీరసం లక్షణాలు ఉంటాయన్నారు. గోర్లను చిన్నవిగా, శుభ్రంగా ఉంచుకోవడం, శుభ్రమైన నీటిని తాగడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకపోవడం, తినక ముందు, తిన్న తర్వాత, మరుగుదొడ్డికి వెళ్లిన తర్వాత చేతులను శుభ్రం చేసుకోనేలా అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఏడాదికి రెండు మార్లు ఆల్‌బెండజోల్ మాత్రలు వేసుకుని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీడీపీఓ హైమావతి, వైద్యాధికారులు నజీర్‌బాషా, మౌనిక, హిమబిందు, భరత్, అలీం, పద్మినీ, హెల్త్ ఎడ్యుకేటర్లు వెంకటేశ్వర్లు, శోభారాణి పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

గుండె జబ్బులపై సిబ్బందికి అవగాహన

మైదుకూరు: మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందికి గుండె జబ్బులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్ మాట్లాడుతూ గుండె పోటు వస్తే కొన్ని లక్షణాలు కనిపిస్తాయని, గుండె దడ దడగా ఉండడం, ఛాతిలో నొప్పి, ఎడమ భుజం లాగడం, స్పృహ కోల్పోవడం లక్షణాలు కనిపిస్తే గంటలోపు ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. డాక్టర్ జ్యోత్స్న మాట్లాడుతూ గుండె జబ్బులకు ఎన్టీఆర్ వైద్య సేవల కింద ఉచితంగా యాంజియో ప్లాస్టు, బైపాస్ సర్జరీలు చేస్తారని సూచించారు. డాక్టర్ కరీముల్లా మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు.



మాట్లాడుతున్న డాక్టర్ మల్లేష్

బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి

ప్రొద్దుటూరు: బీజేపీ బలోపేతం నాయకులంతా కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన వెంకటసుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించారు. బీజేపీ జనరల్ సెక్రటరీ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ వెంకటసుబ్బారెడ్డి 2009 నుంచి జమ్మలమడుగు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా, జిల్లా జనరల్ సెక్రటరీగా పని చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా కోశాధికారి జయలక్ష్మి, జిల్లా సెక్రటరి హరినారాయణ, అసెంబ్లీ కన్వీనర్ పర్లపాడు గౌరీశంకర్, నరేంద్ర, కిరణ్, అస్మద్, గురు, రవి, కుమారి తదితరులు పాల్గొన్నారు.



వెంకటసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఓవర్‌లోడ్‌తో ప్రయాణం.. ఆటో డ్రైవర్లకు ప్రమాదం

ప్రొద్దుటూరు క్రైం: ఆటోలు, గూడ్స్ వాహనాలను ఓవర్ లోడ్‌తో నడపడం ప్రమాదకరమని ఎంవీఐ హేమ కుమార్ అన్నారు. రహదారి భద్రతపై స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో డ్రైవర్లు, సిబ్బందికి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హేమకుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణ అందరి బాధ్యత అన్నారు. ఎంవీఐలు నారాయణ నాయక్, రవీంద్రనాయక్, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్, ఏఓ కరీముల్లా పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని టూటౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. ప్రైవేటు ట్రావెల్స్ డ్రైవర్లు, యజమానులకు గురువారం రహదారి భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ అతి వేగం ప్రమాదాలకు కారణమని తెలిపారు. ఎస్ఐలు ధనుంజయ, రాఘవేంద్ర, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్ పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండలంలోని ఆటో డ్రైవర్లకు గురువారం అవగాహన కల్పించారు. బి.మఠం నాలుగు రోడ్ల కూడలిలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవర్లు యూనిఫాం వేసుకోవాలని, అతి వేగంతో ఆటో నడపరాదని తెలిపారు. మహిళల పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గురప్ప, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్: స్కూల్ బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించాలని బద్వేల్ అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంవీఐ కార్యాలయ ఆవరణలో స్కూల్ బస్సు డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి స్కూల్ బస్సుకు తప్పనిసరిగా సహాయకుడు ఉండాలని, డ్రైవర్లు లైసెన్స్ పొంది ఐదు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని సూచించారు. వాహన కెపాసిటీకి మించి విద్యార్థులను ఎక్కించరాదని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. అగ్ని ప్రమాద నిరోధక యంత్రాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, రవాణా శాఖ అధికారులు జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఎంవీఐ శేఖర్ రావు, అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ, ఫైర్ ఆఫీసర్ చంద్రుడు, సుధాకర్, చెన్నయ్య, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



బద్వేల్: డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ రాజగోపాల్



ప్రొద్దుటూరు: మాట్లాడుతున్న ఎంవీఐ హేమకుమార్

దువ్వూరు: డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. దువ్వూరులో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా డ్రైవర్లకు గురువారం అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపకూడదని తెలిపారు. ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ డ్రైవర్లు ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. నిర్లక్ష్యంగా నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు.